సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం ׀ 22 ׀ ఫిబ్రవరి ׀ 2024





**పట్టుగూళ్లు @ రూ.512**

హిందూపురం మార్కెట్‌లో బుధవారం కిలో బైవోల్టిన్ పట్టుగూళ్లు గరిష్టంగా రూ.512 పలికాయి. మార్కెట్‌కు 4,251 కిలోల పట్టుగూళ్లు మార్కెట్‌కు వచ్చాయి.



**టమాట కిలో రూ.13**

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.2°/18.1°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో ఉదయం చలి వాతావరణం కొనగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

## న్యూస్‌రీల్

### పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు



ఎన్పీకుంట: పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన మౌలిక వసతులపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

కదిరి అర్బన్/ ఎన్పీకుంట: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కదిరి ఆర్డీఓ వంశీకృష్ణతో కలిసి కదిరి మండల పరిధిలోని ముత్యాలచెరువు, కుమ్మరవాండ్లపల్లి, గంగన్నగారిపల్లిలో పోలింగ్ కేంద్రాలను, ఎన్పీకుంట మండల పరిధిలోని మేకలచెరువు, తిమ్మమ్మ మర్రిమాను, ఎదురుదోన గ్రామాల్లోని 197, 198, 199 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యుత్, ఫ్యాన్లు, ఫర్నీచర్, నీటి వసతి, మరుగుదొడ్లు, ర్యాంప్ వంటి సదుపాయాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ రోజున ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదన్నారు. కలెక్టర్ వెంట ఎన్పీకుంట ఎంపీడీఓ ఆదినారాయణ, తహసీల్దార్ నరేంద్రకుమార్, కదిరి డీటీ ముకుంద, ఆర్ఐ మున్వర్ తదితరులు ఉన్నారు.

### 25న జిల్లా హాకీ జట్ల ఎంపిక



ధర్మవరం అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 25న జిల్లా సీనియర్ మహిళలు, సబ్ జూనియర్ బాలికల హాకీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీనియర్ విభాగంలో 1995, జనవరి 1 తర్వాత, సబ్ జూనియర్ విభాగంలో 2008, జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులు. క్రీడాకారులు తమవెంట ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్ తీసుకురావాలి. ఎంపికైన వారు హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మార్చి 8 నుంచి 10వ తేదీ వరకు ప్రకాశం జిల్లాలో జరిగే హాకీ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారు.

# పల్లెకు ప్రగతి బాట

గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలంటారు. కానీ 77 ఏళ్ల స్వతంత్ర భారతావనిలో పల్లె ప్రగతి గురించి పట్టించుకున్న వారే లేరు. కనీసం రోడ్డుకు కూడా నోచుకోని పల్లెలెన్నో కనిపించేవి. కానీ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పల్లెకు కళ వచ్చింది. కనీస సౌకర్యాలతో పాటు ప్రతి గ్రామానికీ తారు రోడ్లు, గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం శరవేగంగా సాగింది. దీంతో పల్లెనుంచి పట్టణానికి రాకపోకలు పెరగ్గా.. యువతకు విద్య, ఉపాధి మార్గం మెరుగుపడింది. ఫలితంగా పల్లెపల్లెనా అభివృద్ధి పరుచుకుంటోంది.

- గ్రామీణ రోడ్లకు మహర్దశ
- మెరుగుపడిన రవాణా సౌకర్యం
- పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలోనే 510 రోడ్ల నిర్మాణం
- రూ.350 కోట్లతో పల్లెపల్లెకూ తారురోడ్డు



ఇది బుక్కపట్నం మండలం రాసింపల్లి తండా నుంచి యర్లంపల్లికి వెళ్లే రోడ్డు. వైఎస్సార్ హయాంలో ఈ గ్రామానికి తారురోడ్డు వేశారు. కానీ ఆ తర్వాత నిర్వహణ గురించి పట్టించుకోలేదు. ఫలితంగా రోడ్డు కంకరతేలి..గుంతలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉండేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే రూ.1.31 కోట్ల వ్యయంతో యర్లంపల్లికి కొత్తగా 5.4 కిలోమీటర్ల మేర తారురోడ్డు వేశారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పుట్టపర్తి అర్బన్: గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ పట్టింది. గతంలో కనీసం అంబులెన్సులు , ఆటోలు వెళ్లలేని గ్రామాలకు రూ. కోట్ల వ్యయంతో జగన్ సర్కార్ తారు రోడ్లు, సిమెంటు రోడ్లు వేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని వందలాది గ్రామాలకు సరైన రోడ్డు మార్గం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జిల్లాలోని ప్రతి పల్లె అభివృద్ధి బాట పట్టింది. పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో ఒక్క పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.350 కోట్లు వెచ్చించి రోడ్లు వేశారు. అలాగే ఇప్పటికే ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. రహదారులు అందుబాటులోకి రావడంతో అభివృద్ధి నడిచొచ్చినట్లయ్యింది.

**పెరిగిన వాహనాల సంఖ్య..**

పల్లెల రోడ్డు సౌకర్యం ఏర్పడటంతో గ్రామీణులూ సొంతంగా బైక్‌లు, కార్లు కొనుగోలు చేశారు. ఫలితంగా జిల్లాలో వాహనాల సంఖ్య కూడా భారీగా పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోనే నూతనంగా రోడ్డెక్కుతున్న వాహనాల సంఖ్య పెరుగుతోంది. అందువల్లే ఇప్పుడు గ్రామాల్లోనూ ఇళ్ల ముందు కార్లు కనిపిస్తున్నాయి.

**ప్రతిపక్షాలు ప్రశ్నించడానికి వీల్లేకుండా...**

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాలనలో సంస్కరణలు తీసుకువచ్చారు. ముఖ్యంగా ప్రతి శాఖలోనూ 'నాడు-నేడు' పథకాన్ని అమలు చేశారు. గత టీడీపీ పాలనకు వైఎస్సార్ సీపీ పాలనకు తేడాలు తెలిసేలా పాత ఫొటోలు తీసి ఉంచారు. అలాగే అభివృద్ధి పనులు చేపట్టాక 'నాడు-నాడు' అంటూ ఫొటో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రతిపక్షాలు సైతం ప్రశ్నించడానికి వీల్లేకుండా పోయింది. అలాగే రోడ్లేలేని గ్రామాలకు సైతం నూతనంగా రోడ్లు వేశారు. దీంతో అత్యవసర సమయంలోనూ రవాణాకు ఇబ్బంది లేకుండా పోయింది. అర్ధరాత్రి వేళ కూడా 108 రయ్యిమంటూ గ్రామానికి వచ్చేస్తోంది.

**మారుమూల ప్రాంతాలపైనే దృష్టి..**

గత నాలుగున్నర ఏళ్లలో ఒక్క పంచాయతీరాజ్ శాఖ పరిధిలోనే జిల్లా వ్యాప్తంగా 2,330 పనులు పూర్తి చేశారు. ఇందులో 400 తారు రోడ్లు, 110 సిమెంటు రోడ్లు ఉన్నాయి. ఇంకా 380 తారు రోడ్లు, 15 సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ పనులన్నీ పూర్తి చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలైన అమడగూరు, నల్లమాడ, ఓడీచెరువు, మడకశిర, తనకల్లు, తలుపుల, రొళ్ల, ముదిగుబ్బ మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి...ఆయా మండలాల్లోనే ఎక్కువగా రోడ్డు పనులు చేపట్టారు. వీటితో పాటు ఆర్అండ్‌బీ, కేంద్ర ప్రభుత్వ నిధులతో మరిన్ని రోడ్డు పనులు పూర్తి చేశారు. ఇక చాలా ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతు పనులు కూడా పూర్తి కావచ్చాయని పంచాయతీరాజ్ అధికారులు చెబుతున్నారు.

**32** జిల్లాలోని మండలాలు

**2,330** పంచాయతీ రాజ్ పరిధిలో చేపట్టిన పనులు

**400** పూర్తయిన తారు రోడ్ల సంఖ్య

**110** పూర్తయిన సిమెంటు రోడ్లు

రూ.**350** కోట్లు రోడ్ల కోసం ప్రభుత్వం చేసిన ఖర్చు

### ఎక్కడ చూసినా తారురోడ్డే



ఒకప్పుడు మా గ్రామానికి రోడ్డు సౌకర్యం సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు మా మండలంలో ఎక్కడ చూసినా తారు రోడ్లే కనిపిస్తున్నాయి. మా ఊరి రోడ్డు వేశాక బైకు కొనుగోలు చేశా. ఇప్పుడు గ్రామానికి ఏ సమయంలో వెళ్లాలన్నా ఇబ్బంది లేదు. ఆర్టీసీ బస్సులు సైతం తిప్పుతున్నారు. మా గ్రామానికి ఇటు పెడపల్లి, అటు ఓడీచెరువు, నల్లమాడకు సైతం రోడ్లు వేసి రవాణా సౌకర్యం మెరుగుపరిచారు. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– ఇమ్రాన్‌ఖాన్, కొండకమర్ల, ఓడీ చెరువు మండలం

### రోడ్ల అభివృద్ధికి నిధులు ఇచ్చారు



జిల్లా ఏర్పాటు తర్వాత రోడ్ల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారు. దీంతో జిల్లా కేంద్రానికి కనెక్టివిటీ బాగా పెరిగింది. అంతేగాక జాతీయ రహదారులు ఏర్పాటవుతున్నాయి. ఇంత వేగంగా ఏ జిల్లాలోనూ అభివృద్ధి జరగలేదు. పెద్ద ఎత్తున సిమెంటు రోడ్లు వేయడంతో ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా పోయింది.

– ఆనంద్‌నాయక్, పెదపల్లి పెద్దతండా, పుట్టపర్తి మండలం

### రూ.350 కోట్లతో పనులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో రూ.350 కోట్ల నిధులతో తారు, సిమెంటు రోడ్ల పనులు చేశాం. ఇంకా కొన్ని రోడ్ల పనులు జరుగుతున్నాయి. కొత్త రోడ్లతో పాటు పాత రోడ్లు మరమ్మత్తులు పూర్తి చేస్తున్నాం. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయడం వల్లే ఇన్ని పనులు పూర్తి చేయగలిగాం.

– గోపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ

### సెక్టార్ అధికారులదే కీలకపాత్ర

- ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలి
- శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సెక్టార్, పోలీస్ సెక్టార్ అధికారుల పాత్ర చాలా కీలకమైందని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డివిజన్ల వారీగా అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, మాస్టర్ ట్రైనర్, కదిరి డీఎల్‌డీఓ సూర్యనారాయణ, ఎన్నికల డేటీలు మైనుద్దీన్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు. సెక్టార్, పోలీస్ సెక్టార్ అధికారుల విధుల గురించి తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు సంబంధించి హ్యాండ్ బుక్‌లు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల విధులపై సెక్టార్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. ముఖ్యంగా వీవీ ప్యాట్, ఈవీఎం, హ్యాండ్‌బుక్, పోలింగ్ కేంద్రాల జాబితా సిద్ధం చేయడం, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ల పనితీరు, మాక్ పోలింగ్ నిర్వహణ తదితర పనులను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. సెక్టార్ అధికారులకు మండల మేజిస్ట్రేట్ అధికారాలు ఉంటాయన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే లిక్కర్, డబ్బు, కానుకల తరలింపు చర్యలను అడ్డుకోవాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి రిటర్నింగ్ అధికారి ద్వారా నివేదికను పంపాలన్నారు. అనంతరం ఈవీఎంలపై డెమో నిర్వహించారు.

### యువశక్తి దేశంగా భారత్

- ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి

అనంతపురం: యువశక్తి దేశంగా భారత్ విరాజిల్లుతుందని ఎస్కేయూ వీసీ కె.హుస్సేన్‌రెడ్డి అన్నారు. ఎస్కేయూ ఫార్మసీ కళాశాలలో 'యువ సంవాద్ - ఇండియా' కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ డాక్టర్ ఎస్ఏ కోరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్కేయూ వీసీ మాట్లాడుతూ.. ప్రపంచంలోని ఏ దేశానికి లేని మానవ వనరులు భారతదేశానికి ఉన్నాయన్నారు. 2047 నాటికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తవుతాయని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగ ఫలంతో సిద్ధించిన స్వేచ్ఛ, సమానత్వ భావాలను పునాదిగా చేసుకుని అగ్రరాజ్యంగా భారత్ ఖ్యాతి దక్కించుకోవాలని ఆకాంక్షించారు. ఇది నెరవేరాలంటే కేవలం యువతతోనే సాధ్యమవుతుందన్నారు. డాక్టర్ ఎస్ఏ కోరి మాట్లాడుతూ.. నవభారత నిర్మాణానికి రూపశిల్పులు విద్యార్థులేనన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విశేషమైన ప్రగతి సాధించి నవ్య సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు.

# తలసరి ఆదాయం అదుర్స్



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు నవరం అమరమ్మ. అమడగూరు మండలం, దీకిరేవులపల్లి గ్రామం. ఆదాయాభివృద్ధిని పెంపొందించేందుకు చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం ఈమెకు రుణాలను మంజూరు చేసింది. వైకేపీ ద్వారా బ్యాంకు లింకేజీ రుణం కింద రూ1.50 లక్షలు, స్త్రీనిధి రుణం కింద రూ. 50 వేలు, జగనన్న తోడు కింద రూ. 10 వేలు మొత్తంగా రూ. 2.10 లక్షలు పొందింది. దీంతో గ్రామంలో కిరాణ దుకాణం ఏర్పాటు చేసుకుంది. కుటుంబాన్ని సంతోషంగా పోషించుకుంటోంది. 2019 ఎన్నికల నాటికి డ్వాక్రా సంఘంలో ఈమె రుణం రూ. 40 వేలు ఉండేది. 'వైఎస్సార్ ఆసరా' పథకం ద్వారా మొత్తం మాఫీ అయిపోయింది. 'వైఎస్సార్ చేయూత' పథకం ద్వారా ఏటా రూ. 18,750 చొప్పున నాలుగేళ్లలో రూ.75 వేలు అమరమ్మ ఖాతాలో జమ అయింది. 2019కు ముందు జీవనోపాధి కష్టంగా ఉండేదని, ఇప్పుడు ఇంటిల్లిపాదీ సంతోషంగా ఉన్నామని అమరమ్మ తెలిపింది.

- ఉమ్మడి జిల్లాలో భారీగా పెరిగిన తలసరి ఆదాయం
- తాజా సూచీల్లో రూ.1.70 లక్షలుగా నమోదు
- టీడీపీ హయాంతో పోల్చితే గణనీయ మార్పు
- సమృద్ధిగా వర్షాలకు సంక్షేమ ఫలాలు తోడై సత్ఫలితాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఏ ప్రాంతంలో అయినా అక్కడి ప్రజల పరిస్థితి, జీవన ప్రమాణాలు, స్థితిగతులు, వ్యవసాయ ఉత్పత్తులు తదితర అంశాలన్నీ తలసరి ఆదాయాన్ని సూచిస్తాయి. తలసరి ఆదాయం గణనీయంగా పెరిగిందంటే పరిస్థితులు సానుకూలంగా ఉన్నట్టు లెక్క. తాజాగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో తలసరి ఆదాయం భారీగా నమోదైంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. 2014-19 మధ్య కాలంతో పోల్చితే ప్రస్తుత పరిస్థితిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది.

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వర్షాలు సమృద్ధిగా కురిశాయి. భూగర్భ జలాలు పెరిగాయి. వ్యవసాయానికి ఢోకా లేకుండా చేశాయి. ఇదే క్రమంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కూడా పథకాలు అమలు చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా డీబీటీ ద్వారా నేరుగా ప్రజలకే ఫలాలను అందించింది. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగయ్యాయి. తాజాగా వెల్లడించిన తలసరి ఆదాయ లెక్కలు ఈ విషయాన్ని ధ్రువపరుస్తున్నాయి.



**ప్రభావం చూపిన సంక్షేమ ఫలాలు..**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 మండలాలున్నాయి. ఇందులో 95 శాతం ప్రజలు వ్యవసాయ రంగం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యలు చేపట్టాక సమృద్ధిగా వర్షాలు కురిశాయి. పుడమిని చల్లగా మార్చి వ్యవసాయానికి ఢోకా లేకుండా చేశాయి. ఉద్యాన పంటలకు ఊతమిచ్చాయి. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా పంటల ఉత్పాదకత పెరిగింది. ఉమ్మడి జిల్లా నుంచి ఏటా 32 లక్షల టన్నుల ఉద్యాన పంట ఉత్పత్తులు వివిధ రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇందులో చీనీ, అరటి పంటల దిగుబడులు ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలోనే పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు పరిస్థితిలో గణనీయమైన మార్పును తీసుకొచ్చాయి. తలసరి ఆదాయం పెరుగుదలలో విశేష ప్రభావాన్ని చూపించాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో డీబీటీ (డైరెక్ట్ బెనిఫిషియరీ ట్రాన్స్‌ఫర్) ద్వారా రమారమి రూ.34 వేల కోట్లు నేరుగా ఖాతాల్లోకే చేరడం ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదలకు కారణమైంది.

**ఉమ్మడి జిల్లాలో తలసరి ఆదాయం నమోదు ఇలా**

| సంవత్సరం | తలసరి ఆదాయం |
|---|---|
| 2018-19 | రూ.1,15,538 |
| 2019-20 | రూ.1,28,631 |
| 2020-21 | రూ.1,37,597 |
| 2021-22 | రూ.1,64,187 |
| 2022-23 | రూ.1,76,813 |

**పారిశ్రామిక ఫలితాలూ భేష్..**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పారిశ్రామికీకరణ వల్ల కూడా మంచి ఫలితాలు వచ్చాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన చేయూతతో పెద్ద సంఖ్యలో ఎంఎస్ఎంఈలు ఏర్పాటయ్యాయి. 2019లో ఈ రంగం ద్వారా తలసరి ఆదాయం రూ.9,843 ఉండగా, 2021-22 సంవత్సరంలో రూ.13,346గా నమోదైంది. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం ఇవ్వడంతో స్థానికంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించాయి. సేవా రంగంలోనూ భారీగా వృద్ధి రేటు నమోదైంది. 2019లో రూ.21 వేలుగా ఉన్న తలసరి ఆదాయం, 2022లో రూ.27,202గా నమోదు కావడం గమనార్హం.

# ప్రజలే మా స్టార్ క్యాంపెయినర్లు



వైఎస్సార్ విగ్రహ ఆవిష్కరణ అనంతరం అభిమానులు వేసిన గజమాలతో ఎమ్మెల్యే కేతిరెడ్డి



వైఎస్సార్ సీపీలో చేరిన చేనేతలతో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

- జనంతోనే జగన్ పొత్తు.. ఎంతమంది కలిసి వస్తారో రండి
- ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీలపై మండిపడ్డ ఎమ్మెల్యే కేతిరెడ్డి
- 300 చేనేత కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

ధర్మవరం: రానున్న ఎన్నికల్లో జనంతో మాత్రమే జగన్ పొత్తు ఉంటుందని, వైఎస్సార్‌సీపీకి సంక్షేమ పథకాలు పొందిన ప్రజలే స్టార్ క్యాంపయినర్లని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 1, 3 వార్డుల్లో చెలిమి పెద్దన్న, శంకర తేజ, యుగంధర్‌ల ఆధ్వర్యంలో స్థానిక శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 300 చేనేత కుటుంబాల వారు ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన కప్పల ఆదినారాయణ, బ్యాళ్ల హరీష్, పురుషోత్తం, సుబ్రహ్మణ్యం, బాబా ఫకృద్దీన్, దాసరిలోకేష్, పల్లా గంగాధర్, పొరాళ్ల నాగరాజు, వెంకటనారాయణ, అన్నం ఆదినారాయణ, సాకే భాస్కర్, భీమన పల్లి నాగరాజు తదితరులకు ఎమ్మెల్యే కేతిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్షాలన్నీ కలిపి పొత్తులతో వచ్చినా...కుట్రలతో వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేనేతకు చేయూత లేక నేతన్నలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. అప్పుల బాధతో నేతన్నలు ఆత్మహత్యలకు తెగిస్తే అప్పుడు అధికారంలో ఉన్న చంద్రబాబు కార్మికుల కుటుంబాలను కనీసం పరామర్శించలేదన్నారు. అందువల్లే ఆనాడు తాము చేనేత కార్మికుల కోసం ధర్మవరంలో జోలెపట్టి యాచించి రూ.25 లక్షల సాయాన్ని బాధిత కుటుంబాలకు అందించామన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ హయాంలో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున 52 మందికి ఆర్థిక సాయం అందించామన్నారు. అలాగే ముడిపట్టు రాయితీని ఏడాదికి ఒకేసారి ఇచ్చే విధంగా ' వైఎస్సార్ నేతన్న నేస్తం' ద్వారా ఏటా రూ.24 వేలు అందిస్తున్నామన్నారు. నవరత్నాల పథకాలతో ధర్మవరం నియోజకవర్గంలో 90 శాతం మంది నిరుపేదలకు రూ.3,200 కోట్లు నిధులు జమ చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. రూ.5 వేల కోట్లతో తాము ఆర్‌ఓబీ, రిజర్వాయర్లు, రోడ్లు, ఆస్పత్రులు, 'నాడు-నేడు'తో పాఠశాలలను అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్ష టీడీపీ నాయకులు కోర్టులకెళ్లి అడ్డుపడుతున్నారన్నారు. అభివృద్ధి నిరోధకులకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు.

**వైఎస్సార్ విగ్రహ ఆవిష్కరణ ..**

పట్టణంలోని 1వ వార్డులో కౌన్సిలర్ చెలిమి రామలక్ష్మమ్మ, చెలిమిపెద్దన్నల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నీలూరి ప్రకాష్, కోటిరెడ్డి బాలిరెడ్డి, చెలిమి రామకృష్ణమ్మ, శంకరతేజ, చెలిమి పెద్దన్న, శంకర యుగంధర్, చందమూరి నారాయణరెడ్డి, పెణుజూరి నాగరాజు, గోరకాటి పురుషోత్తంరెడ్డి, కడప రంగస్వామి, జేసీబీ రమణ, గజ్జల శివ, చింతా మారుతి, చాంద్‌బాషా, ఉడుముల రాము, గడ్డం రంగ, కత్తె పెద్దన్న, సిద్ధిరాజేష్, కాచర్ల అంజి, బైముతక రమణ, ఎస్పీ బాషా పాల్గొన్నారు.



సభకు భారీగా హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

## క్లుప్తంగా

### గ్రంథాలయంలో వసతులు భేష్



రికార్డులు తనిఖీ చేస్తున్న గ్రంథాలయ శాఖ జిల్లా కార్యదర్శి రమ

**ధర్మవరం అర్బన్:** ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ బుధవారం ధర్మవరం గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, రోజుకు ఎంతమంది పాఠకులు వస్తున్నారు, వారికి అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా అని గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతిని అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో కల్పించిన వసతులకు ఆమె సంతృప్తి చెంది అభినందించారు.

### ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలి



వ్యవసాయ పంచాంగం అందిస్తున్న రమణారెడ్డి, రామసుబ్బయ్య, రవికిషోర్

**పుట్టపర్తి:** వచ్చే ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటలపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డి, ఏరువాక కో–ఆర్డినేటర్ రామసుబ్బయ్య, వ్యవసాయ శాస్త్రవేత్త రవికిషోర్ సూచించారు. మన పంచాయతీ–మన వ్యవసాయం కార్యక్రమంలో భాగంగా సర్పంచులు, రైతులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం బుక్కపట్నం వ్యవసాయ కార్యాలయంలో బుధవారం జరిగింది. రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను, వాటి స్థితిగతులను వివరించి, వచ్చే ఖరీఫ్‌లో ఏఏ పంటలు సాగు చేయాలి, నీటి యాజమాన్యం, ఎరువుల వాడకం తదితరాలను వివరించారు. వ్యవసాయ పంచాంగాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ సతీష్, సర్పంచులు భాస్కర్‌రెడ్డి, నాగలక్ష్మి, రమణయ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటచౌదరి, గ్రామ చైర్మన్ ఆదినారాయణ, ఏఈఓలు సునీత, సుధ, వైఎస్సార్‌సీపీ నేతలు కేశప్ప, విజయభాస్కర్‌రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

# అభిలాష... తీరిందిలా





స్త్రీ వేషధారణలో షఫీ

- వెండితెరపై రాణిస్తున్న షఫీ
- స్త్రీ పాత్రతో ప్రత్యేక గుర్తింపు
- బుల్లితెరపై విస్తృత అవకాశాలు







నిర్మాత ఎస్వీ సత్యనారాయణ చేతుల మీదుగా గ్లోబల్ ఫేం అవార్డు అందుకుంటున్న షఫీ, తమిళ మూవీలో ప్రతిభకు నంది పురస్కారం అందుకుంటున్న దృశ్యం (ఫైల్)

**రొళ్ల:** విలక్షణమైన నటనతో వెండి తెరపై రాణిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్నాడు రొళ్లకు చెందిన షఫీ. నటనలో పాత్ర ఏదైనా సరే... అందులో జీవిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. చిరుప్రాయం నుంచే నటనపై ఆసక్తి పెంచుకున్న షఫీ... విద్యార్థి దశలోనే తనలోని కళాకారుడిని రంగుల ప్రపంచానికి పరిచయం చేసిన తీరును 'సాక్షి'కి వివరించారు.

**మారుమూల గ్రామం నుంచి..**

మాది రొళ్ల మండలం, తుబినకుంట గ్రామం. కర్ణాటక సరిహద్దున ఉండడంతో మాపై కన్నడ ప్రభావం ఎక్కువగా ఉంది. మా నాన్న సయ్యద్ ఘనీ సాహెబ్, తల్లి గులాబ్‌జాన్‌కు నేను రెండో సంతానం. మా అన్న, తమ్ముడికి ఇద్దరికీ పెళ్లిళ్లయ్యాయి. వారు వేరు కాపురం ఉంటున్నారు. అమ్మ, నాన్న ఇద్దరూ ఐదేళ్ల క్రితమే చనిపోయారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ సొంతూరిలోనే చదువుకున్నా. ఆరు నుంచి ఇంటర్ వరకు రొళ్లలో చదువుకున్నా. ఆ తర్వాత మడకశిరలో డిగ్రీ పూర్తి చేశాను.

**నటన అంటే చాలా ఇష్టం..**

చిన్నప్పటి నుంచి నాకు నటన అంటే చాలా ఇష్టం. ఇదే విషయాన్ని అమ్మ, నాన్నతో చెబితే వారు బుద్ధిగా చదువుకోవాలని మందలించేవారు. దీంతో వారికి తెలియకుండా నటనలో శిక్షణ పొందుతూ వచ్చాను. నాలో ఆత్మవిశ్వాసం పెరిగిన తర్వాత సినీ అవకాశాల కోసం బెంగళూరుకు చేరుకున్నా. మూడేళ్ల పాటు డైరెక్టర్లు, నిర్మాతల చుట్టూ తిరిగాను. ఫలితం లేకుండా పోయింది. ఈ విషయం తెలుసుకున్న అమ్మ, నాన్నతో పాటు బంధువులు, స్నేహితులు న్ను ఇంటికి రమ్మని కబురు పంపారు. అయితే నేను అనుకున్న లక్ష్యాన్ని సాధించకుండా ఊళ్లోకి వెళితే అక్కడి గేలి చేస్తారని భయపడ్డాను. దీంతో బెంగళూరులోనే ఉంటూ నా ప్రయత్నాలు కొనసాగించా.

**సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని..**

నా ప్రయత్నాలు వృథా కాలేదు. నాలోని నటుడిని కన్నడ సినీ దర్శకులు చైతన్య, శశి గుర్తించారు. 2017లో 'నాటీమ్', 'కన్నడిగరిగాగి' చిత్రాల్లో హీరోయిన్ స్నేహితురాలిగా స్త్రీ పాత్రలో నటించే అవకాశం కల్పించారు. పాత్ర భిన్నంగా ఉండడంతో వారు కోరుకున్న వైవిధ్యాన్ని చూపించలేనని భయపడ్డాను. అయితే స్త్రీ పాత్రలో నా నటన అందరినీ ఆకట్టుకుంది. ఆ తర్వాత 'మజభారత' 'కన్నడికోగిలే' అడిషన్స్‌కు అవకాశం దక్కింది. అక్కడ కూడా స్త్రీ పాత్రలో మెప్పించా. తర్వాత వరుస అవకాశాలు వచ్చి పడ్డాయి. తెలుగులో 'ప్రేమ నిజం కాదు, ఓ మగువా, సీతామౌనం, వేశ్యం, మా అత్త బంగారం, పోలీసు వారి హెచ్చరిక, గుప్పెడంత మనసు' సీరియల్స్‌లో నటించాను. ఈ నేపథ్యంలోనే జబర్దస్త్, తగ్గేదెలా కామెడీ షోలు నటనలో నన్ను మరింత రాటుదేల్చాయి.

**గుర్తింపు తెచ్చిన స్త్రీ వేషధారణ..**

స్త్రీ వేషధారణ నాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. 'స్వప్న' పేరుతో నేను నటించిన సన్నివేశాలన్నీ భలే కామెడీ పండించాయి. స్త్రీగా నటించడం అంటే మామూలు విషయం కాదు. మాటల్లో మృదుత్వం, అభినయం, బిడియం, సిగ్గు అన్ని కలబోస్తూ ఉండాలి. నడకలో వయ్యారాలు వలకబోయాలి. ఇలాంటి సన్నివేశాలు రక్తికట్టించగలిగాను. తాళి తమిళ సినిమాలో నా నటనకు నంది పురస్కారం దక్కింది. ఇటీవల అల్లరి నరేష్ హీరోగా నటించిన ఉగ్రం సినిమాలో స్త్రీ పాత్రలో రాణించినందుకు 2023లో నిర్మాత ఎస్వీ సత్యనారాయణ చేతుల మీదుగా గ్లోబల్ ఫేం అవార్డును అందుకున్నా. ప్రస్తుతం పాన్ ఇండియా పుష్ప–2 మూవీలో నటిస్తున్నా. నన్ను ఆదరిస్తున్న ప్రేక్షక దేవుళ్లందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నా.

# నాణ్యమైన వైద్యసేవలందాలి

- ఎఫ్‌ఆర్‌ఎస్ నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు
- డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్



వైద్యులతో సమీక్షిస్తున్న డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్

**హిందూపురం టౌన్:** పేదలందరికీ నాణ్యమైన వైద్య సేవలందించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ చొరవ తీసుకోవాలని వైద్యాధికారులను డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్ ఆదేశించారు. స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రికి బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఓపీ, ఐపీ సేవలు, మందుల సరఫరా, వార్డుల నిర్వహణపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్‌కుమార్, ఆర్‌ఎంఓ డాక్టర్ రుక్మిణమ్మను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో పర్యటించి రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు, ఆహారం ఇతర లోటుపాట్లపై ఆరా తీసారు. అనంతరం ఆస్పత్రిలో వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో విభాగాల వారీగా సమీక్షించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సమయపాలన ముఖ్యమని, ఎఫ్‌ఆర్‌ఎస్‌ను గట్టిగా అమలు చేస్తున్నామన్నారు. సమయపాలనలో క్రమశిక్షణ పాటించని వారిపై, ఎఫ్‌ఆర్‌ఎస్ నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రాంట్ లీవ్ లేకుండా ఆస్పత్రికి హాజరుకానీ వారికి నోటీసులు ఇచ్చి శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**స్టెమీ కార్యక్రమం ద్వారా గుండెకు చికిత్స..**

ప్రభుత్వ ఆస్పత్రిలో అందే ప్రతి సేవ ఉచితమన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని విభాగాల్లో ప్రభుత్వం ఉచిత వైద్యసేవలందిస్తోందన్నారు. అనంతపురం జిల్లాలో 22 ప్రభుత్వ ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, హెల్త్ సెంటర్లలో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎస్‌టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్‌క్షన్ (స్టెమీ) సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. గుండెపోటు బాధితులకు గోల్డెన్ అవర్‌లో 40 నిమిషాల్లోనే చికిత్స అందించడం ద్వారా బాధితులను ప్రాణాపాయం నుంచి బయటపడేలా చేయడమే స్టెమీ కార్యక్రమం ముఖ్యోద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రిలో 8 మంది రోగులకు ప్రాణాపాయం తప్పేలా చేసిన వైద్యులను అభినందించారు.

**కొరత లేకుండా చర్యలు..**

హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి నెలా విజయవాడలో వాకిన్ ఇంటర్వ్యూలు జరుగుతున్నాయని, ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల పోస్టులు భర్తీ చేశారన్నారు. అలాగే ఆస్పత్రిలో నర్సింగ్ సిబ్బంది కొరత ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఆ పోస్టులను భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో డీ–అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి డాక్టర్ రాజగోపాల్ సారథ్యంలో మెరుగైన వైద్యం అందిస్తున్నారని, ఈ విభాగంలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బందిని భర్తీ చేసేలా ప్రతిపాదనలు పంపినట్లు గుర్తు చేశారు.

### ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

**మడకశిర రూరల్:** పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు డీఈఓ మీనాక్షి సూచించారు. మడకశిర మండలం గుండుమలలోని కేజీబీవీని బుధవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థుల విద్యాప్రగతి, సౌకర్యాలపై ఆరా తీశారు. పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జీసీడీఓ శివమాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### జలకవనం బ్రోచర్ల విడుదల

**ధర్మవరం అర్బన్:** పెనుకొండ గగన్‌మహల్‌లో మార్చి మూడో తేదీన సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జలకవనం (రాయలసీమ జిల్లాలో నీటి సమస్యలపై కవి సమ్మేళనం) నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను బుధవారం ధర్మవరంలోని కాలేజీ సర్కిల్‌లోనున్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ హరి, ధర్మవరం కన్వీనర్ వేణుగోపాలాచార్యులు, ఉపాధ్యాయులు లలితమ్మ, తులసీకుమారి, నాగేంద్ర, శాంతలింగం విడుదల చేశారు.

# ఐక్యతకు దేశీయ భాషలే పట్టుగొమ్మలు



మాట్లాడుతున్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ త్రివేణి

**ధర్మవరం అర్బన్:** దేశ ఐక్యతకు దేశీయ భాషలే పట్టుకొమ్మలని డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ త్రివేణి పేర్కొన్నారు. ధర్మవరంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ తమ మాతృభాషని కాపాడుకున్నప్పుడే భాషా సంస్కృతులు పరిరక్షించుకున్నట్లన్నారు. మాతృభాషను కాపాడుకుంటూ ఇతర భాషల్ని నేర్చుకోవడం ద్వారా శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని తెలిపారు.

**కదిరి అర్బన్:** పట్టణంలోని ఎస్టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాతృభాష విశిష్టతను అధ్యాపకులు విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆదినారాయణ, హైదరాలి, నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

**ధర్మవరం రూరల్:** పట్టణంలోని సూర్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో బుధవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు తెలుగు భాష గురించి ఉపాధ్యాయులు వివరించారు.

**పుట్టపర్తి:** బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సయ్యద్ మగ్బుల్ హుస్సేన్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతు ప్రతి ఒక్కరూ మాతృభాషపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. అనంతరం తెలుగు సాహిత్యం పుస్తకాన్ని పంపిణీ చేశారు.

# ఎస్కేయూకు హుందాయ్ దన్ను



హుందాయ్ కంపెనీ ప్రతినిధిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలకు హుందాయ్ కంపెనీ దన్నుగా నిలిచింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద రూ.33 లక్షలు విలువ చేసే 16 ఇంటరాక్టివ్ ప్యానళ్లు, 10 కంప్యూటర్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డిని హుందాయ్ మోబీస్ కంపెనీ ప్రతినిధులు ఎం.డి.యాంగ్ యెన్గ్ డియుక్, హెచ్‌ఆర్‌జీఏ కో–ఆర్డినేటర్ హుమిన్‌హో, పీఎన్ శ్రీనివాస్ తదితరులు కలిసి మాట్లాడారు. కళాశాల, కంపెనీకి మధ్య అంతరం తగ్గేలా నూతన సిలబస్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు ఎస్కేయూ వీసీ తెలిపారు. కంపెనీ అవసరాలకు దోహదపడేలా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కల్పించేందుకు సమ్మతించిన హుందాయ్ కంపెనీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఎండీ యాంగ్ యెన్గ్ డియుక్ మాట్లాడుతూ.. ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల ఓ ఉత్తమమైన కళాశాలగా తాము గుర్తించామని, ఈ నేపథ్యంలో స్పాన్సర్‌షిప్ ఇచ్చేందుకు ముందుకు వచ్చామన్నారు. భవిష్యత్తులో మరింత సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కళాశాల విద్యాభివృద్ధికి దోహదపడేలా పరికరాలను అందజేసిన హుందాయ్ కంపెనీ ప్రతినిధులకు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ధన్యవాదాలు తెలిపారు.

# కురుబ కార్పొరేషన్ చైర్మన్‌కు పరామర్శ





కోటి బాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సమన్వయకర్త బోయ శాంతమ్మ

**బత్తలపల్లి:** అనారోగ్యంతో బాధపడుతున్న కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబును ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ బుధవారం బత్తలపల్లిలోని స్వగృహంలో పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జెడ్పీటీసీ కోటి సుధను పరామర్శించి, ఆమెకు ధైర్యం చెప్పారు.

### కమనీయం రాములోరి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

**కదిరి టౌన్:** అయోధ్య సీతారాముల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి రాములోరి కల్యాణం తిలకించి తరించారు. ఇందుకు కదిరిలోని బాలుర కళాశాల ప్రాంగణం వేదికైంది. కదిరి సేవాభారతి ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన అర్చక బృందం బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా మేళ తాళాల మధ్య సంప్రదాయబద్ధంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తుల 'జై శ్రీరామ్' నినాదంతో సభా ప్రాంగణం ప్రతిధ్వనించింది. తిరుపతికి చెందిన గాయకులు అన్నమాచార్య కీర్తనలతో అలరించారు. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. 'అయోధ్య సీతారాములు, కల్యాణోత్సవ విశిష్టతను చక్కగా వివరించారు. అనంతరం చాగంటిని, టీటీడీ ఈఓ ధర్మారెడ్డిని ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డితో పాటు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమగట్టు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్, సేవా భారతి అధ్యక్షులు చెన్నరాయశెట్టి, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



చాగంటిని సన్మానిస్తున్న దృశ్యం



హాజరైన భక్తులు

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**తనకల్లు:** మండలంలోని కొర్తికోటకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మాతంగి తిమ్మయ్య (52) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. గ్రామ గృహసారథిగా ఆయన పనిచేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లి అక్కడ బేల్దార్ పనితో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలోనే గృహ నిర్మాణ పనుల్లో పాలుపంచుకున్న ఆయన ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. తిరుపతిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను డిశ్చార్జ్ చేసుకుని కుటుంబసభ్యులు స్వగ్రామానికి తీసుకురాగా బుధవారం మృతి చెందారు. మృతునికి భార్య, ఓ కుమార్తె ఉన్నారు.

### విద్యుదాఘాతంతో పెయింటర్‌కు తీవ్రగాయాలు

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో కొత్త ఇంటికి రంగులు కొడుతున్న పెయింటర్ నవీన్‌కుమార్ మెయిన్ లైన్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని తోటి కూలీలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అతడిని అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### 'కుబైర్ స్టీల్స్'లో అగ్ని ప్రమాదం

- ఏడుగురు కార్మికులకు స్వల్ప గాయాలు



కుబైర్ స్టీల్స్‌లో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

**హిందూపురం అర్బన్:** కర్ణాటక సరిహద్దు గోళ్లాపురం పారిశ్రామికవాడలోని కుబైర్ స్టీల్స్ కర్మాగారంలో బుధవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కర్మాగారం ఆవరణలో ఉదయం 10 గంటల వేళ మంటలు చెలరేగడంతో ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్, సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు. కర్మాగారంలో 300 మంది కార్మికులు పని చేస్తుండగా.. ప్రమాదంలో కృష్ణ, సోలబ్, పంచరత్తన్, ప్రవీణ్ కుమార్, డింపుల్ కుమార్, బిట్టప్ప, త్రిభువన్‌లు గాయపడ్డారు. వారిని వెంటనే గౌరీబిదనూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ మాట్లాడుతూ... తుక్కు ఇనుము ఉన్న ప్రాంతంలో ఖాళీ పెయింట్ డబ్బాలు ఉంచారని, వాటి నుంచే మంటలు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. హిందూపురం రూరల్ సీఐ శ్రీనివాసులు కూడా సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి దారి తీసిన కారణాలపై ఆరా తీశారు.

### విద్యుదాఘాతంతో వివాహిత మృతి

**రామగిరి:** విద్యుత్ షాక్‌కు గురై ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... రామగిరి మండలం పేరూరు సమీపంలోని పెదయ్యగారికొట్టాలకు చెందిన రమాదేవి (36), అక్కులప్ప దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. వ్యవసాయ పనులతో జీవనం సాగించేవారు. బుధవారం ఉదయం ఇంటి వద్ద బాత్‌రూమ్‌కు వెళ్లిన రమాదేవి... అక్కడ తెగిపడిన విద్యుత్ వైర్లను గమనించక కాలు పెట్టింది. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. రామగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

### క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతి అందజేస్తున్న చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

**ప్రశాంతి నిలయం:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సంస్కృతి విద్యాసంస్థల చైర్మన్ బీడుపల్లి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సంస్కృతి విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్న యూత్ ఫెస్టివల్‌లో భాగంగా మూడు రోజులుగా నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బుధవారం బహుమతులు అందజేశారు.